ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05.04.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో రైతులకు అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరుతూ అన్ని మండల కేంద్రాల్లో బీజేపీ ఈరోజు రైతు సత్యాగ్రహ దీక్షలు చేపట్టింది.
2. సంగారెడ్డి జిల్లా లోని ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 40 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.
3. భారతీయ రిజర్వ్ బ్యాంక్ "మానిటరీ పాలసీ కమిటీ" వరుసగా 7వ సారి రెపో రేటును యథాతథంగా ఉంచి, ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ప్రకటించింది.
4. ఈ రోజు స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బీజేపీ-దీక్ష

రాష్ట్రంలో రైతులకు అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను తక్షణమే అమలు చేయాలన్న డిమాండ్ తో బీజేపీ పార్టీ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో రైతు సత్యాగ్రహ దీక్షలు చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వడ్లకు క్వింటాలుకు 500 రూపాయాల బోనస్, 2 లక్షల రూపాయాల రైతు రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకారకు 15 వేలు, రైతు కూలీలకు 12 వేల రూపాయల సాయం చేయాలని డిమాండ్ చేస్తోంది. సంగారెడ్డి పట్టణం లోని నటరాజ్ థియేటర్ వద్ద చేపట్టిన దీక్ష శిబిరంలో బీజేపీ ఓసీబీ జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. కరువు వల్ల పంటలు నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 25 వేల నష్టపరిహారం అందించాలన్నారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా జిల్లా అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డి, తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

(డెస్క్/ సంగారెడ్డి, పీటీసీ)

కిషన్ రెడ్డి-అంబర్ పేట

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ ఉదయం అంబర్ పేట్ నియోజకవర్గం లో పర్యటించారు. బతుకమ్మ కుంట, ధ్రువ హోటల్ లో అంబర్పేట్ నియోజకవర్గం ఆర్య వైశ్య సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. భరత్ నగర్ కామ్యూనిటీ హాల్ లో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

(పీఎన్)

సంగారెడ్డి-ఫార్మా- మంత్రి రాజనర్సింహ

సంగారెడ్డి జిల్లా లో హత్నూరు మండలం చందాపూర్ శివారులో ని SB ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. బాధితుల ఒక్కొక్కరికి 40 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించేలా కంపెనీ యాజమాన్యంతో మంత్రి చర్చించి ఆమోదింపచేశారు. బాధిత కుటుంబాల్లో అర్హులైన ఒకరికి స్థానికంగా ఉన్న ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబానికి 1 లక్ష రూపాయలను తక్షణ సాయంగా తన నివాసంలో నిన్న రాత్రి అందజేశారు.

(పీటీసీ, సంగారెడ్డి)

ఖమ్మం-ఎన్నికలు

స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆకాంక్షించారు. రాజుపేటలో జరిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్ పోస్ట్ ల నిఘాను పటిష్ఠం చేసినట్లు తెలిపారు. నగదు, మద్యం, గంజాయి, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే చర్యలు ముమ్మరం చేయాలన్నారు.

(PTC, khammam)

REV. BI-MONTHLY RBI-POLICY

భారతీయ రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ వరుసగా 7వ సారి రెపో రేటును యథాతథంగా ఉంచింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఈరోజు ద్రవ్య విధానాన్ని ప్రకటించారు. రెపో రేటును 6.5% వద్ద ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ జిడిపి రేటు 7 శాతంగా ఉంటుందని, సిపిఐ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉంటుందని ఆయన చెప్పారు. మార్చి 29, 2024 నాటికి భారతదేశ విదేశీ మారక నిల్వలు అత్యధికంగా $ 645.6 బిలియన్లకు చేరుకున్నాయని దాస్ చెప్పారు. అంతర్జాతీయ వర్తకం 2024లో

మెరుగయ్యే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణం కంటే తక్కువగానే ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతోందని, అసంఘటిత రంగం మెరుగుపడుతుందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల గురించి మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు రుణాలు సమస్యగా మారిందని శక్తికాంతదాస్ అన్నారు.

- ఎన్ ఎస్ డి

జగ్జీవన్ -జయంతి

ఈ రోజు స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి. ఈ సందర్భంగా పలువురు నాయకులు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకొన్నారు. జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. హైదరాబాద్, జిల్లా కేంద్రాల్లోని జగ్జీవన్ రామ్ విగ్రహాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

- (డెస్క్/పీటీసీస్)

జగ్జీవన్ –కిషన్ రెడ్డి

బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నిజాం కాలేజ్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ వ్యాప్తంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని అన్నారు. విద్యావంతులైన జగ్జీవన్ రామ్ అనేక రకాలుగా దేశానికి, ప్రజలకు సేవ చేశారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 1977లో ఎమర్జెన్సీ సమయంలో ఆయన చూపించిన ధైర్యం, సాహసం ప్రజలు ఎప్పుడూ మర్చిపోరన్నారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో నరేంద్ర మోదీ

నాయకత్వంలో బీజేపీ పార్టీ రానున్న రోజుల్లో దేశంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు.

(పీఎన్)

శాంతి స్వరూప్

తొలి తరం తెలుగు న్యూస్ రీడర్, ప్రముఖ వ్యాఖ్యాత శాంతి స్వరూప్ కన్నుమూశారు. రెండు రోజుల క్రితం గుండెపోటుతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ ఈ ఉదయం తుదిశ్వాస విడిచారు. తెలుగులో తొలిసారి వార్తలు చదివిన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1983 నుంచి 2011లో పదవీ విరమణ చేసేవరకు దూరదర్శన్‌లో పనిచేశారు.  శాంతిస్వరూప్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

(డెస్క్)

సంతాపం- రేవంత్, కిషన్ రెడ్డి

శాంతి స్వరూప్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి,  కిషన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.తొలి తరం న్యూస్ రీడర్‌గా తెలుగు ప్రజలు అందరికీ సుపరిచితులైన శాంతి స్వరూప్ గారి మరణం బాధాకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  ఒక సందేశంలో పేర్కొన్నారు. 1983 నుంచి న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తనదైన ముద్ర వేశారని, దూరదర్శన్ ద్వారా ఆయన అందించిన సేవలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చిరస్మరణీయం అన్నారు. శాంతి స్వరూప్ ఎంతో మంది న్యూస్ రీడర్లకు స్ఫూర్తిగా నిలిచారని కిషన్ రెడ్డి అన్నారు.

(పీఎన్)

రంగస్థలం-వరంగల్

రంగస్థల కళలను కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం వారిని గుర్తించవలసిన అవసరం ఉందని వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అభిప్రాయపడింది. సాంఘిక, సామాజికపరమైన ఇతివృత్తం కలిగిన నాటకాలను మే 14, 15, 16 తేదీలలో వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి మూడేసి నాటకాల ప్రదర్శనకు ఏర్పాటు చేశామన్నారు.

(పీటీసీ, వరంగల్)

సిరిసిల్ల-మోడల్ స్కూల్స్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మోడల్ పాఠశాలల్లో 7 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు ఎల్లుండి ప్రవేశ పరీక్ష జరుగుతుందని, జిల్లా విద్యా ధికారి రమేశ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు కు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

(పీటీసీ, సిరిసిల్ల)

నిర్మల్-కేజీబీవీ

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీకేజీబీవీ పాఠశాల లో నిన్న ఆహార కల్తీ వలన 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రత్యేక అధికారి సునీత, వంట మనిషి పద్మ, అకౌంటెంట్ మౌనికలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

(పీటీసీ, నిర్మల్)